

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



# గరుడ వాహనంపై దేవదేవుడు







పోటెత్తిన భక్తజనం
గోవింద నామస్మరణలతో మారుమ్రోగిన తిరుమల గిరులు



ఐదవరోజు ఏడుకొండలస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం మలయప్ప శ్రీకాంతునిరూపం ధరించి జగత్సమ్మోహకంగా భక్తులకు కనువిందుచేశారు.

తిరుమల,అక్టోబర్ 8ప్రభాతవార్తప్రతినిధి: వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు మంగళవారంరాత్రి గరుడవాహనసేవ కారుమబ్బులు, చల్లటిగాలుల నడుమ సాగింది. ఉదయం నుండి ఆకాశం మేఘావృతమైనా సాయంత్రం కారుమబ్బులు వేసుకుని వాయుదేవుడు చల్లటి వింజామరాలు వీచాడు. సాయంత్రం 6.30గంటలకు వాహనమండపం నుండి మొదలైన జగన్నాటకసూత్రధారి శ్రీమలయప్పస్వామి గరుడవాహనం మెల్లగా కదులుతూ గోవిందనామ్మరణల మధ్య మాఢవీధుల్లో భక్తులకు అభయమిచ్చాడు. 108 వైష్ణవదివ్యదేశాల్లో గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. శ్రీవిల్లిపుత్తూరు నుండి పంపిన గోదాదేవి ప్రత్యేక పూలమాలలు ,సహస్రనామమాల,చెన్నై గొడుగులు స్వామివారి గరుడవాహనసేవకు మరింత శోభను చేకూర్చాయి. గరుడవాహనంద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజేశారు. జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగవదధిష్టుతుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజేశాడు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ శ్యామలరావు దంపతులు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, డిఐజి షిమోసి బాజ్‌పేయి, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, జెఈఓలు గౌతమి,వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు,సివిఎస్ఓ శ్రీధర్, విజిలెన్స్ విఎస్ఓలు ఎన్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, తిరుమల డిఎస్పీ విజయశేఖర్ ,భక్తులు పాల్గొన్నారు. దాదాపు 3లక్షలమంది భక్తులు గరుడునిపై వేంచేసిన వానతేయుని దర్శనం చేసుకున్నారు.

## శ్రీచెంగాళమ్మకు మహాలక్ష్మి అలంకారం



సూళ్లూరుపేట, అక్టోబర్ 8 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మహాలక్ష్మి అలంకారంలో మంగళ వారం భక్తులకు దర్శనమిచ్చింది. శరన్నవ రాత్రుల సందర్భంగా దేవస్థానం ప్రాంగణం లోని యాగ మండపంలో గోమాతకు పూజలు చేసిన అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణలతో మహాచండీయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎర్రం హనుమారెడ్డి, హిమబిందు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మహాలక్ష్మి అలంకారానికి ఉభయకర్తలుగా నాయుడుపేటకు చెందిన ఓడూరు మునికృష్ణారెడ్డి, పావని దంపతులు వ్యవహరించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా లవ్లీ ఈవెంట్స్ నెల్లూరు వారిచే భక్తిరస నృత్య ప్రదర్శన అలరించింది. అమ్మవారికి శరన్నవ రాత్రుల్లో సారెలు సమర్పించే కార్యక్రమంలో భాగంగా కస్వారెడ్డి పాలెం, దేగలపాలెం, సోనియాగాంధీ నగర్, బాపూజీ కాలనీల నుంచి అమ్మణ్ణికి మేళతాళాలతో వైభవంగా సారె సమర్పించారు. ఈ కార్యక్రమాలు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో జరిగాయి.

## పల్లె పండగ పంచాయితీ వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ వీడియో కాన్ఫిరెన్స్





తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 8, ప్రభాతవార్త

రాష్ట్రంలో ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేది వరకు పల్లె పండుగ పంచాయితీ రాజ్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాన్ అధికారులు ఆదేశించారు. మంగళవారం అమరావతి సచివాలయం నుండి పల్లె పండుగ పంచాయితీ రాజ్ వారోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. తిరుపతి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని తెలిపారు. గత ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా 13325 పంచాయితీల్లో ఒకే రోజున గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు చేయించిన పనులకు కలెక్టర్లే పరిపాలన అనుమతులు ఇవ్వడం జరిగిందని, అన్ని పనులు 14 నుంచి వారం రోజుల వ్యవధిలో శంకుస్థాపనలు చేయించి సంక్రాంతి పండుగ లోగా పనులు అన్ని పూర్తి చేయించాలని కలెక్టర్లును ఆదేశించారు. ఉపాధి హామీ పథకం మెటిరియల్ కాంపోనెంట్ నిధులు రూ. 2500 కోట్లతో దాదాపు 20 వేల పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. కలెక్టరేట్ నుండి వీడియా కాన్ఫిరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ పల్లె పండగ పంచాయితీ వారోత్సవాలకు పూర్తి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. భూమి పూజ చేయాల్సిన అన్ని పనులను గుర్తించామని తెలిపారు. ప్రజాప్రతినిధులకు అందరికి ప్రభుత్వం ద్వారా స్వాగతించి వారి షెడ్యూల్‌ని తీసుకోవడం షెడ్యూల్ తయారు చేయడం జరిగిందని తెలిపారు. పంచాయితీకు సంబంధించిన సమాచార బోర్డులను పెట్టడం జరిగిందని అన్నారు. ప్రతి పంచాయితీలో ప్రభుత్వ భవనాల కాంపౌండ్ వాల్స్, స్మశాన వాటికలు, నాలెడ్జ్ బోర్డ్స్, సిసి రోడ్లు, బిటి రోడ్లు గుర్తించిన పనులకు రూ. 74 కోట్లు మంజూరు చేసామని ఇంకా 25 కోట్లు మంజూరు చేయాల్సి ఉందని కలెక్టర్ ఉప ముఖ్యమంత్రికి తెలిపారు. తిరుపతి జిల్లాలో ఉపాధి హామీ పనులలో భాగంగా వ్యక్తిగత పనులను కల్పించడం జరుగుతుందని, జిల్లాలో పారం పాండ్స్ పనులు ఇప్పటికే టార్గెట్ పూర్తి చేసామని తెలిపారు. ఇసుక, సిమెంట్ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్ జిల్లా కలెక్టర్‌తో పాటు డిఆర్ఓ పెంచల్ కిషోర్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, పంచాయితీ అధికారిణి సుశీల దేవి, డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్, గ్రామీణ నీటి సరఫరా, పంచాయితీరాజ్, ఎస్ఈలు, జడ్పి డిప్యూటీ సిఈవో, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రాహుకేతుదోష నివారణ పూజలకు

## వేదపండితులు దూరం

### అర్చకులకు అవకాశం



శ్రీకాళహస్తి,అక్టోబర్ 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇక మీద రాహు కేతుదోష నివారణ పూజల నిర్వహణకు వేద పండితులు దూరం. పూజలను అర్చకులు నిర్వహించాలని దేవస్థానం నిర్ణయించింది, ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ ఉత్తర్వులు జారి చేసారు. దేవస్థానంలో 21 మంది వేదపారాయణ దారులున్నట్లు వేదపారాయణంతో పాటు వివిధ రాహుకేతుదోష నివారణ పూజల మండపాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరిలో కొందరు వేదపారాయణ దారులు రాహు కేతుదోష నివారణ మండపాల్లో పూజల అనంతరం భక్తుల నుంచి దక్షిణ పేరుతో బలవంతంగా డబ్బులు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల వస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.అయితే దక్షిణ ఇవ్వని భక్తుల పట్ల అసంతృప్తి చూపుతూ నిర్లక్ష్యవైఖరిని ప్రదర్శిస్తూన్నట్లు సిసి కెమెరాల్లో కూడా ధృవపరచుకున్నట్లు ఇఓ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయన్నారు. దేవస్థానం క్యాడర్ సంఖ్యలో 16 మందది ఉండగా ఇతర దేవాలయాల నుంచి ఐదు మంది ఇతర దేవాలయాల నుంచి డెప్యూటేషన్ మీద ఉన్నారన్నారు. సోమవారం నుంచి వేద పండితులు కేవలం నిత్య వేదపారా యణం,సాయంత్రం శ్రీ స్వామి అమ్మవార్ల దీపారాధన భక్తులకు వేద ఆశీర్వచనాలు మాత్రమే చేయాలని ఆదేశించారు. సమయ పాలన తప్పని సరి అని పేర్కొన్నారు. రాహుకేతుదోష నివారణ పూజలకు వేదపండితుల అవసరమైతే ఉపకార్యనిర్వహణాధికారి లిఖిత పూర్వక ఆదేశాలతో విధులు నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. 21 మంది వేదపారాయణ దారులకు షిఫ్టుల ప్రకారం నిత్య వేదపారాయణ విధులు నిర్వహించాలన్నారు. ఆలయంలోని కంచుగడప లోపల రూ.2500లు,రూ.5వేల పూజలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ రూ.2500ల పూజలకు అర్చకులు కె.రఘుగురుకుల్,జీవా గురుకుల్, డి.తులసీరాంలను నియమించారు.రూ.5వేల పూజల వద్ద సంభావన అర్చకులు యస్.కార్తీకేయ గురుకుల్,వి.నీలకంఠ గురుకుల్స్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారి చేసారు.

## మహాభాగ్య ప్రదాయకం ధనలక్ష్మీ నమోస్తుభ్యం...!!

బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 8 ప్రభాతవార్త



ధన, ధాన్య, శ్రీలక్ష్మీ నమోస్తుతే అంటూ భక్తులు అమ్మవారికి ముడుపులు చెల్లించు కొన్నారు. ప్రముఖ శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా శరవన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజైన మంగళవారం అమ్మలనుగన్న గంగమ్మ సకలసంపదలు సమకూర్చే ధనలక్ష్మీదేవీగా భక్తులకు దర్శనమిచ్చింది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకులచే గంగమ్మకు విశేషాభిషేకం, ధనలక్ష్మీదేవీ అలంకరణగావించారు. ప్రాంగణంలో వేదపండితులు వివిధ హోమాలు, అమ్మవారి సంకల్పం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా హోమం యొక్క విశిష్టతను భక్తులకు వివరించారు. బెంగళూరు ఎమ్మెల్సీ రామోజీగౌడ, మంజులలు గోశాలకు రూ. 25వేలు విరాళంగా అందించారు. పిళ్ళారి ఏజెన్సీస్ అధినేత పిళ్ళారి జీవన్ ప్రకాష్, పుంగనూరు దొమ్మలపాటి నగేష్‌బాబు, స్వర్ణగౌరి, ఒంటిమిట్ట నాయుని వారు, రాజంపేట సుబ్రమణ్యం, వెంకటరమణమ్మ, మదనపల్లి దిలీప్, హేమంత్, కృష్ణయ్య, లక్ష్మీదేవి, సుజాత, బెంగళూరు కృష్ణప్ప, శకుంతల, చౌడేపల్లి సిద్ధప్ప, విజయగౌరి, కొలింపల్లి మురళి, చంద్రకళ, ఒంటిమిట్ట రవి, రాజేశ్వరీ, యనమసామనపల్లి ప్రకాష్‌రెడ్డి, శశికళ, రాజంపేట సుదర్శన్, లక్ష్మీదేవి, బెంగళూరు నిఖిల్‌రాజ్‌లు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలు, మెమొంటోలిచ్చి సత్కరించారు.ఆలయ ఇఓ ఉపకమీషనర్ ఏకాంబరం,అధికార,సిబ్బంది సేవలందించారు.

## వరదునికి వైభవంగా గరుడసేవ

కాణిపాకం, అక్టోబర్ 8 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి పెరిందేవి సయిత వరదరాజ సా ్వమి ఆలయంలో మంగళవారం రాత్రి గరుడసేవను అత్యంత వైశవోపేతంగా నిర్వహించారు. కలియుగ వైకుంఠం తిరుమలలో గరుడసేవ జరిగే సమయంలో శ్రీవరద రాజస్వామి ఆలయంలో స్వామివారికి గరుడసేవను నిర్వ హించడం ఆనవాయితీ. ఈకార్యక్ర మానికి కాణిపాకంకు చెందిన యాదవ వంశస్థులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఆలయంలో పగలు స్వామివారి మూలవిరాట్‌కు అర్చకులు వేపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేకఅభిషేకాలు నిర్వహించి,అలంకరించి పూజలు చేసి దూపదీప నైవేద్యాలను సమరి ్పంచారు.అలాగే ఆలయ మండపంలో ప్రత్యేకహోమాలను నిర్వహించారు. తిరిగి రాత్రి స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం తన కిష్టమైన అలంకరించిన గరుడవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు

## మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు..

### చిత్తూరు జిల్లాలో ఇప్పటికే 104 షాపులకు 1253 నామినేషన్లు.. నేడే చివరి ఛాన్స్ !!

### చిత్తూరు.. కుప్పం నియోజకవర్గాల్లో భారీగా దరఖాస్తులు.. ప్రైవేట్ మద్యం దుకాణాలపై ఫోకస్ పెట్టిన తెలుగు తమ్ముళ్లు !!

కుప్పం, అక్టోబర్ 8 ప్రభాతవార్త

చిత్తూరు జిల్లాలో ప్రైవేట్ మద్యం దుకాణాలకు భారీగా టెండర్ దంఖాస్తులు చేరుతున్నాయి. జిల్లాలో 104 షాపులను ప్రభుత్వం నోటిఫై చేసిన విషయం విదితమే. ఈనెల 1వతేది నుంచి టెండర్ నామినేషన్లను ఎక్సైజ్ అధికారులు ఎనిమిది కేంద్రాలతో పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. టెండర్ల స్వీకరణకు బుధవారం సాయంత్రం 5గంటల దాకా మాత్రమే సమయం ఉంది. ఇదిలా ఉండగా జిల్లాలోని 104 ప్రైవేట్ మద్యం షాపుల ఏర్పాటుకు సంబంధించి మంగళవారం సాయంత్రం నాటికి అత్యధికంగా దాదాపు 1253 టెండర్ నామినేషన్లు దాఖలైనట్లు సమాచారం. జిల్లాలోనే అత్యధికంగా కుప్పం నియోజకవర్గంలో 10 షాపులకు గాను ఏకంగా 209 టెండర్ నామినేషన్లు దాఖలయ్యాయి. కుప్పం మున్సిపాలిటీలో 5 షాపులకు 107, గుడుపల్లెలో 1షాపుకు 32, శాంతిపురంలో 2షాపులకు 47, రామకుప్పంలో 2షాపులకు 23 టెండర్లు అందాయి. ఇక చిత్తూరు మున్సిపాలిటీలో 14 షాపులకు గాను మంగళవారం నాటికి 175 టెండర్లు దాఖలయ్యాయి. గుడిపాలలో



2షాపులకు 42, జిడి నెల్లూరులో 4షాపులకు 42, బంగారుపాళ్యంలో 4షాపులకు 75 దరఖాస్తులు అందాయి. యాదమరిలో 3షాపులకు 81, పూతలపట్టు 3షాపులకు 21, తవణంపల్లి 4షాపులకు 63, ఐరాల 4షాపులకు 66, కార్వేటినగరం 3షాపులకు 42, ఎస్ఆర్‌పురంలో 2షాపులకు 26, నగరి మున్సిపాలిటీలో 6షాపులకు 13, నింద్ర మండలంలో 1 షాపుకు 3 టెండర్లు వచ్చాయి. విజయపురం మండలంలో 3షాపులకు 70, పుంగనూరు మున్సిపాలిటీలో 6 షాపులకు గాను 31 దరఖాస్తులు మాత్రం వచ్చాయి. చౌడేపల్లిలో 3షాపులకు 18, సోమలలో 3షాపులకు 20, పలమనేరు మున్సిపాలిటీలో 6షాపులకు 61 టెండర్లు వచ్చాయి. వి.కోట మండలంలో 3షాపులకు 21, గంగవరంలో 2షాపులకు 15, బైరెడ్డిపల్లిలో 2షాపులకు 31, పులిచెర్లలో 3షాపులకు 19, సదుంలో 2షాపులకు 2, రొంపిచెర్లలో 2షాపులకు 4 టెండర్ దరఖాస్తులు మాత్రం అందాయి. కాగా బుధవారం టెండర్ నామినేషన్లకు చివరిరోజు కావడంతో మరిన్ని టెండర్లు దాఖలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా జిల్లాలో ఉన్న కుప్పం, చిత్తూరు, పుంగనూరు, పూతలపట్టు, నగరి, పలమనేరు, జిడి నెల్లూరు నియోజకవర్గాల్లో మద్యం షాపులను దక్కించుకునేందుకు అధికార తెలుగుదేశం పార్టీ నేతలు భారీగానే టెండర్లు దాఖలు చేసినట్లు సమాచారం. మద్యం దుకాణాల్లో వీరి హవా కన్పిస్తోంది. ఏది ఏమైనా నగరి, పుంగనూరు నియోజకవర్గాలు మినహా మిగతా నియోజకవర్గాల్లో భారీగానే ప్రైవేట్ మద్యం దుకాణాలకు దరఖాస్తులు అందాయి.

## ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ...

శ్రీకాళహస్తి,అక్టోబర్ 8 ప్రభాతవార్త



రెవెన్యూ కార్యాలయ ఆవరణలో గుట్టగా ఉన్న విలువైన కలప

శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలోనికి ప్రవేశిస్తేనే ఎడమ వైపు గుట్టగా కలప కనబ డుతుంది. ఇది సుమారు ఏడు సంవత్స రాలుగా ఎండకు ఎండు తూ,వానకు తడుస్తూ,చలికి వణుకుతూ చూపరులను కలచి వేస్తుంది. శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయం బ్రిటిష్ కాలం నాటిది.దాని స్థానంలో అప్పటి శాసన సభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కొత్త భవనం నిర్మాణానికి రూ.60లక్షలు మంజూరు చేయించి కొత్త భవనాన్ని నిర్మించారు. బ్రిటిష్ కాలం నాటి భవనాలను పడగొట్టారు. అందులో ఉన్న కలప రంగూన్ టేక్ ఉడ్‌ను ఆవరణలో గుట్టగా పోసారు. తరువాత మరచి పోయారు. ఈ కలప విలువ లక్షల్లో ఉంటుంది. పట్టించుకునే దిక్కులేదు. అధికారుల నిర్లక్ష్యంతో విలువైన రంగూన్‌టేక్ మట్టిపాలౌతుంది.మరి దీనిని వేలం వేస్తారా? అలాగే ప్రకృతిలో కలసిపోని అని వదలిపెడతారా? అనేది రెవెన్యూ అధికారులకే ఎరుక.

## నూతన ఎంపిడిఒగా బాలాజీ బాధ్యతలు

పెద్దపంజాణి, అక్టోబర్ 8 ప్రభాతవార్త



పెద్దపంజాణి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాలాజీ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇదివరకు పిటిఎంలో పనిచేసేవారు. బదిలీల్లో భాగంగా పెద్దపంజాణి ఎంపిడిఒగా నియమితులయ్యారు. ఇక్కడ ఎంపిడిఒగా పనిచేస్తున్న అబ్దుల్ రహీం కలకడ మండలానికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఎంపిడిఒ బాలాజీ మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు.

## మహాలక్ష్మిగా ముత్యాలమ్మ

బంగారుపాళ్యం, అక్టోబర్ 8 ప్రభాతవార్త:



దసనరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి మహాలక్ష్మిగా ముత్యాలమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. బంగారుపాళ్యం గ్రామదేవత ముత్యాలమ్మకు ఆలయ అర్చకులు మురగస్వామి, కార్తీక్ స్వామి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అమ్మవారికి ఉత్సవమూర్తికి మహాలక్ష్మిగా అలంకరించి దీపారాధనలు నిర్వహించారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా బంగారుపాళ్యంకు చెందిన ప్రతాప్‌సేన్, శంకర్, సాంబశివమూర్తి సురేంద్ర, బాబురెడ్డిలు వ్యవహరించారు. అమ్మవారిని మాజీ జడ్పీ ఛైర్మన్ కుమారరాజ, ఆలయ ఛైర్మన్ ఎంబి. కృష్ణమూర్తి ఇతర కమిటీ సభ్యులు దర్శించుకున్నారు. అలాగే ఓంశక్తి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఉత్సవానికి ఉభయదారులుగా బంగారుపాళ్యం ఎంపీటీసీ ఎంబి పద్మావతి దంపతులు వ్యవహరించారు.

## మహాలక్ష్మి అవతారంలో శ్రీ తిరుపతి గంగమ్మ

కుప్పం, అక్టోబర్ 8 ప్రభాతవార్త

శరన్నవరాత్రులను పురస్కరించుకుని సోమవారం శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజు నిర్వహించారు. అలాగే ఎస్‌పిఆర్ జూనియర్స్ చే ఆలయ ప్రాంగణంలో చిన్నారుల నృత్య పోటీలను నిర్వహించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్‌తో పాటు ఉభయదారులు, అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

కుప్పంరూరల్, అక్టోబర్ 8 ప్రభాతవార్త

కుప్పం రామచంద్రారోడ్‌లో నెలకొనిఉన్న శ్రీ విశ్వదుర్గ పరమేశ్వరి అమ్మవారు మంగళవారం భక్తులకు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. ఈసందర్భంగా నిరా ్వహకులు స్థానిక సిరి కళాక్షేత్రం అధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటుచేయించారు. చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్కూటర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు : ఇద్దరికి గాయాలు



చౌడేపల్లి, అక్టోబర్ 8 ప్రభాతవార్త

స్కూటర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని పెద్దయల్లకుంట్ల పంచా యతీ చెడుగుట్లపల్లికి చెందిన జయప్ర కాష్(23) అయ్యప్ప మాలధారణలో ఇరుముడి చెల్లించేందు సదుంకు టూవీలర్‌పై బయలుదేరాడు. తిరుపతి మార్గంలోని ఆమినిగుంట అక్కడే వతల మలుపు వద్ద వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. ఈప్రమాదంలో స్కూటర్‌లో ప్రయాణిస్తున్న జయప్రకాష్‌తోపాటు విక్కీ(7)లకు గాయాలయ్యాయి. వారిలో జయప్రకాష్ ఆరోగ్య పరిస్థితివిషమించడంతోఅతన్ని108గణేష్, ప్రసాద్‌ల ద్వారా మదనపల్లి ఏరియా అసుపత్రికి తరలించారు

## యాదమరి మండల ఈడిగ కులస్తులకు వైన్‌షాపు కేటాయించాలి

చిత్తూరురూరల్, అక్టోబర్ 8 ప్రభాతవార్త:




యాదమరి మండలంలో అత్యధిక జనాభా కలిగిన గౌడకులస్తులకు ఒక వైన్‌షాపు కేటాయించాలని జిల్లా ఈడిగ గౌడ్ సంఘ ప్రధాన కార్యదర్శి తుమ్మల గోపి గౌడ్, యాదమరి మండల అధ్యక్షుడు వెంకటేశులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు విలేకరులతో దాదాపు మండలంలో గౌడకులస్తులు 12వేలమంది, 6వేల మంది ఓటర్లు కలిగి వున్నారని, ఇక్కడ కల్లుగీతపైన ఆధారపడి చాలా కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ప్రస్తుతం వారికి జీవనాధారం లేక పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైన్‌షాపు కేటాయింపులో గౌడకులస్తులకు 10శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చివున్నారు కావున ప్రభుత్వం ఈడిగ కులస్తులకు సహకరించి అత్యధిక గౌడకులస్తులు కలిగిన యాదమరి మండలానికి ఖచ్చితంగా ఒక షాపు కేటాయించాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి లోకేష్, మండల తెలుగుదేశం పార్టీ తెలుగునాడు కల్లుగీత అధ్యక్షుడు జగదీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటుచేసుకోవాలి

శాంతిపురం, అక్టోబర్ 8 ప్రభాతవార్త



రైతులు ఇళ్ల వద్ద, పొలాల వద్ద కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటుచేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ అన్నపూర్ణమ్మ పేర్కొన్నారు. మంగళవారం కడపల్లి, కదిరి ఓబనపల్లి, పాలకొల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా రైతుల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానం, ఉద్యానవన పథకాలు, రైతు భరోసా తదితరాలపై వివరించారు. పట్టుశాఖ ప్రత్యేకాధికారి రవీంద్రారెడ్డి పట్టు శాఖలో లభించే రాయితీలు వివరించారు. కార్యక్రమంలో ఎ. అప్పోజి, ఆర్ఎస్‌కె సిబ్బంది గోవర్ధన్, నవీన్, మునెమ్మ, రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ వైస్‌ఛైర్మన్‌ను సత్కరించిన కంగుంది గ్రామస్తులు

కుప్పం, అక్టోబర్ 8 ప్రభాతవార్త



ఏపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంను మంగళవారం ఆయన స్వగ్రామం అయిన కంగుంది గ్రామస్తులు, తెలుగుదేశం పార్టీ నేతలు ఘనంగా సత్కరించారు. తమ గ్రామ మార్గదర్శి దివంగత సర్పంచ్ పిఆర్ శ్యామన్న తనయుడు, తమకు గ్రామపెద్దగా ఉంటూ నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో అందరివాడుగా పేరు తెచ్చుకుని సిఎం చంద్రబాబునాయుడు ఆశీస్సులతో రాష్ట్ర స్థాయిలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా పిఎస్ మునిరత్నం బాధ్యతలు చేపట్టడం తమ గ్రామానికే గర్వకారణమని వారు పేర్కొన్నారు. ఆయన మరింత ఉన్నతస్థాయికి భవిష్యత్తులో ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెదేపా సీనియర్ నేత వీసి మంజునాథ్, నేతలు లోకేష్, తిరుపతి, నాగరాజు, షరీఫ్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయండి

తొట్టంబేడు, అక్టోబర్ 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని ఆర్డీఓ భాను ప్రకాశ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శ్రీకాళహస్తి ఆర్డీఓ కార్యాలయ పరిధిలో 8 మండలాలు వస్తాయని ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో తెలుసుకుని వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు. కార్యాలయానికి వివిధ సమస్యలతో వచ్చే ప్రజలతో అధికారులు మర్యాదగా నడుచుకోవాలని కోరారు. ముఖ్యం గా భూ సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని వీటిపై ఒక్కొక్క మండలాన్ని సందర్శించి అక్కడ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలుతీసుకుంటామన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పెండింగ్‌లో ఉండరాదని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఎఓ శ్రీదేవి, డిఎ రాఘవయ్య, డిటి శాంతి, సీనియర్ అసిస్టెంట్ మునిరాజమ్మ, సిబ్బంది కరుణాకర్ పలువురు సిబ్బందిపాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## దుర్గమ్మకు కాణిపాకం గణనాధుని సారె బహూకరణ

కాణిపాకం, అక్టోబర్ 8 ప్రభాతవార్త:



విజయవాడ దుర్గా మల్లేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానం తరపున మంగళవారం పట్టువస్త్రాల (సారె)ను సమర్పించారు. ప్రతిఏటా దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కాణిపాకం దేవస్థానం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఈమేరకు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఆలయ అధికారులు, అర్చకులు మంగళవారం విజయవాడ చేరుకుని అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. పట్టువస్త్రాలను సమర్పించేందుకు విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంకు చేరుకున్న వారికి దుర్గగుడి ఆలయ ఈఓ కెఎస్. రామారావు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వీరు మంగళవాయిద్యాల నడుమ నూతన పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువెళ్ళి ఆలయంలో అందజేశారు. వాటిని అమ్మవారికి అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం ఎమ్మెల్యే మురళీమోహన్, ఈఓ పట్టెం గురుప్రసాద , ఆలయ అధికారులు, అర్చకులకు వేదాశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో విజయవాడ పోలీస్ కమీషనర్(సీపీ) రాజశేఖర్‌బాబు, డీసీ రత న్రాజు, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, కాణిపాకం, దుర్గమ్మ దేవస్థానంల అధికారులు, అర్చకులు, వేదపండితులు, పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## కంచి కామాక్షి అలంకరణలో శ్రీచౌడేశ్వరిదేవి

సదుం, అక్టోబరు8ప్రబాతవార్త



మండల పరిదిలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో భాగంగా మంగళవారం జాంద్రపేటలోని శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి కంచి కామాక్షి అమ్మవారి అలంకరణ చేశారు. ఉదయం అభిషేకం నిర్వహించి అనంతరం కామాక్షి అలంకరణలో దర్శనం జరిపించారు. అదేవిధంగా సదుం లోని శ్రీసదుమమ్మకు, పచ్చారుమాకులపల్లె గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ గంగాపురమ్మకు శ్రీలలితాదేవి అలంకరణ చేశారు. ఉదయం అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో మహిళల చేత కుంకుమాభిషేకాలు జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదే విధంగా తితిదే ఆధ్వర్యంలో బూరగమందలోని శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అదిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## యర్రగుంట్లవారిపల్లెలో ఉచిత పశువైద్య శిబిరం

సదుం, అక్టోబరు 8 ప్రబాతవార్త



తాటిగుంటపాలెం పంచాయతీ యర్రగుంట్ల వారిపల్లెలో మంగళవారం ఆంద్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గోకుల మిషన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పశువులకు డీవార్మింగ్ చేసి పశు పునర్ఉత్తికి సంబందించి పరీక్షలు చేశారు. అనంతరం గ్రామ సభ నిర్వహించి పశువపోషణలో మెలకువలు వివరించారు. పశుగణాభివృద్ధి సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 90ఆవులకు పరీక్షలు నిర్వహించి రైతులకు మినరల్‌మిక్చర్‌ను పంపిణీ చేశారు. అనంతరం బదిలీపై వెలుతున్న పశువైద్యాధికారి సుబ్రమణ్యంను తెలుగుదేశం పార్టీ నాయకులు వై. వెంకటరమణారెడ్డి, మునిరెడ్డి, గ్రామస్థులు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది జగదీష్, ఆలీ, గౌతమ్, నందు, మురళి, మునీంద్ర, మునికేశవులు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## జె.ఎన్.టి.యు.ఏ యూనివర్శిటి ఖో..ఖో టీమ్స్ ఎంపికలు

కోట, అక్టోబర్ 8 ప్రభాతవార్త



జెఎన్‌టియు ఏ అంతర విశ్వవిద్యాలయల క్రీడ పోటీలల్లో పాల్గొనే జట్ల ఎంపికలు కోట మండలం విద్యానగర్ ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో మంగళవారం జరిగాయి. ఈఎంపికలు యూనివర్శిటి పరిశీలకులు జోజిరెడ్డి అద్వర్యంలో జరిగాయి. పురుషుల విభాగంలో 75 మంది పాల్గొనగా 15 మంది ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి నుంచి ఎంపికయ్యారు. వీరు డిసెంబరులో కాలికట్ యూనివర్శిటి నందు జరగబోవు సౌత్ ఇంటర్ యూనివర్శిటి పోటీల్లో పాల్గొంటారు. మహిళల విబాగంలో ఐదు జిల్లాల నుంచి 60 మంది క్రీడా కారులు పాల్గొనగా ఇద్దరు ఐఎస్‌టి నుంచి ఎంపికయ్యారు. ఈ సందర్బంగా కళాశాల డైరెక్టర్, డాక్టర్. వి. విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఖో ఖో జట్లు ఎంపికల బాధ్యతను శిక్షణ శిభిరాన్ని నిర్వహించే బాధ్యతను యూనివర్శిటి అధికారులు తమ కళాశాలలో ఏర్పాటు చేయడం పట్ల వారికి దన్యవాదములు తెలిపారు. అనంతరం యూనివర్శిటి సెక్రటిరి జోజిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి వసతులు ,వనరులు కల్గిన కళాశాల మా యూనివర్శిటిలో ఉండటం ఈ లాంటి అవకాశం తమ కు దక్కడం పట్ల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదవాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటిరి డాక్టర్. మల్లికార్జున్ రెడ్డి కే. సుకుమార్, శోభారాణి, రామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికేఆర్‌కు సైన్సుఅండ్ ఆర్ట్సు కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్

### కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

కోట, అక్టోబర్ 8 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికేఆర్ సైన్సు అండ్ ఆర్ట్సు కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ లభించినట్లు కళాశాల కరస్పాడెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం మండలంలోని విద్యానగర్ ఎన్‌బికెఆర్ సైన్సు అండ్ ఆర్ట్సు కళాశాలలో ఆయన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత నెలలో 24,25 తేదిల్లో తమ కళాశాలను న్యాక్ పీర్ టీమ్ పరిశీలించందన్నారు. డిగ్రీ కళాశాలలకు 3.22 పాయింట్లతో ఏ గ్రేడ్ గుర్తింపు ఇవ్వడం జరిగిందన్నారు. ముందుగా అధ్యాపకఅధ్యాపకేతర సిబ్బందిని రామ్ కుమార్ రెడ్డి అభినందించారు. ఏ గ్రేడ్ రావడం పట్ల తమ పై మరింత భాద్యత పేరిగిందన్నారు. రాబోవు రోజుల్లో కళాశాలను మరింత అభివృద్ధి చేసి ఈప్రాంత విద్యార్ధులకు మేరుగైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు దామోదర్ రెడ్డి, మేనేజర్ కోటం రెడ్డి రామకృష్ణరెడ్డి, ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, ఐ. క్యూఎసీ కో ఆర్డినేటర్ టి. రాజష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీ బిజేపినే

### బిజేపి తిరుపతి జిల్లా అధ్యక్షులు డా. చంద్రప్ప

వెంకటగిరి, అక్టోబర్ 8, ప్రభాతవార్త



ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వ నమోదులు కలిగిన పార్టీ భారతీయ జనతా పార్టీని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప తెలిపారు. మండలంలోని పెట్లూరు, గొట్టగుంట, మొగళ్లగుంట గ్రామంలో మండలం ఇన్చార్జి, బిజేపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయడానికి వెంకటగిరి రూరల్ మండల అధ్యక్షులు కోటి ఆధ్వర్యంలో పర్యటించి విస్తృతంగా సభ్యత్వ నమోదు చేయించారు. బిజేపిలో ఉన్న సభ్యత్వాలు ఏ పార్టీకి ప్రపంచంలో లేవని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలన ప్రపంచ దేశాలకే ఆదర్శంగా ఉన్నట్లు తెలిపారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లాలో విరివిగా సభ్యత్వ నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు గురుప్రసాద్, పెరుమాళ్, జిల్లా ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు వినయ్ కుమార్, బిజేపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలో వందకు పైగా సభ్యత్వాలు చేసిన పెరుమాళ్‌ని జిల్లా అధ్యక్షులు చంద్రప్ప దుశాలువతో సత్కరించి అభినందించారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని దాన్యం విక్రయించుకోవాలి

వెంకటగిరి, అక్టోబర్ 8, ప్రభాతవార్త

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని దాన్యం విక్రయించుకోవాలని ఏడిఏ నాగార్జున సాగర్ తెలిపారు. మండలంలోని జంగాలపల్లి, పెట్లూరు గ్రామాలలో పోలం పిలుస్తోంది. కార్యక్రమం వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు నాగార్జున సాగర్ మాట్లాడుతూ రాబోయే రబీ కాలము నందు సాగుచేయాల్సిన వరిపంట రకములు సాగు పద్ధతులు గురించి సమగ్రంగా రైతులకు వివారించారు. అలాగే వ్యవసాయ శాఖ పథకాల వరి పంట మద్దతు ధర పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు రైతులకు వాటి వినియోగం గురించి చర్చించారు. వ్యవసాయ యాంత్రీకరణ గురించి వివరించారు. అదే విధంగా ఎన్‌ఎల్ఆర్ - 15048 రకం సాగు పద్దతులు గురించి రైతులకు తెలియజేశారు. పశు సంవర్ధక శాఖ




డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ పశువులలో గాలికుంటు వ్యాధికి గొర్రెలలో మేకలలో వచ్చు వ్యాధుల గురించి వాటి నివారణకు వేసుకోవాల్సిన టీకాలు గురించి విపులంగా వివరించారు. మినరల్ మిక్సర్‌ను పశువులలో దాణాగా ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి పి. సుజాత రైతులకు జనుము, జీలుగ, పిల్లిపెసర పచ్చిరొట్ట విత్తనాలు సాగు గురించి వివరించారు. అలాగే కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త విజయశ్రీ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలైన ఉద్యాన, కూరగాయల పంటలు గురించి వివరించారు. గ్రామాలలో పోషకాహార తోటలను ఏర్పాటు చేసుకుని పురుగు మందులు వాడకుండా ఆర్గానిక్ కూరగాయల సాగు వైపు రైతులు రైతు మహిళలు దృష్టి పెట్టాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్త బికే నాయక్ మాట్లాడుతూ వరి పంటలో పోటాష్ వినియోగం వలన నాణ్యమైన దిగుబడిని సాధించగలమని తెలిపారు. నిమ్మ సాగు రైతులకు తెగుళ్ళు, పురుగుల నివారణ పద్ధతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీ రామ మోహన్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాదం శివకుమార్, సుమతీ, ఏఎంసి అసిస్టెంట్ గోపాల్ పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుంది సద్వినియోగం చేసుకోవాలి

వాకాడు, అక్టోబర్ 8, ప్రభాతవార్త




రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పొలం పిలుస్తుంది కార్యక్రమం ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వాకాడు వ్యవసా య శాఖ అధికారిని దీప తెలిపారు. మంగళవారం మండలంలోని బాలిరెడ్డి పాలెం, మొలగనూరు పంచాయితీ లలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన శుద్ధి వలన కలుగు ప్రయోజనాలు, సీజన్‌లో నారు ముడి, బీజామృతంతో విత్తన శుద్ధి, ఎరువుల వలన కలుగు ప్రయోజనాలు గురించి వివరించారు. పశువులు, గొర్రెలు, మేకలు సీజనల్ వ్యాధులు నివారణ, మత్స్యకార, పథకాలు, రాయితీలు గురించి పశుసంవర్ధక శాఖ సిబ్బంది రమేష్ మాట్లాడారు. సర్పంచ్ రమణమ్మ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక పాలసీ విధానంను ప్రజలే గమనిస్తున్నారు

### వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వాకాడు, అక్టోబర్ 8, ప్రభాతవార్త



ఇసుక విధానం పాలసీ పై ఏ ప్రభుత్వం హయంలో ధర లు ఎక్కువగా ఉన్నాయి ప్రజలే గమనిస్తున్నారని తిరు పతి జిల్లా వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళ వారం వాకాడులో రామ్ కుమార్ రెడ్డి నివాసంలో స్ధానిక విలేకరులతో మాట్లా దుతూ ఇసుకపై ఆ రెండు పత్రికలో కథనాలుగా వస్తున్నా యన్నారు. ఇది మంచి ప్రభుత్వం పరిపాలన కాదు అని, పథకము పేరని తెలి పారు. టిడిపి పార్టీ ఇచ్చిన పథకాలను అమలు చేయలేక లడ్డుపై ఇంత కథనాలు సృష్టించి ప్రజలను పక్కదారి పట్టించేందుకు ఆరోపణలు సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు కొడవలూరు దామోదర్ రెడ్డి, హిమ కుమార్ రెడ్డి, సర్పంచి మధుసూదన్ రెడ్డి, సుధాకర్ నాయుడు, నాగూర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ భార్గవ్ రామ్, పెంచల రెడ్డి, వాకాటి రవి కుమార్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ధనలక్ష్మి అవతారంలో కాత్యాయని అమ్మవారు

వెంకటగిరి, అక్టోబర్ 8, ప్రభాతవార్త

నవరాత్రుల సందర్భంగా హరి హర క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి పరశురామ అవతార అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనలక్ష్మి అలంకారణంలో భక్తులకు దర్శనం ఇచ్చిన కాత్యాయని అమ్మవారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

## తమ్మిన పట్టణంలో క్రీడా సామాగ్రి పంపిణీ

చిల్లకూరు, అక్టోబర్ 8, ప్రభాతవార్త

మండల పరిధిలోని తమ్మిన పట్నం గ్రామ పంచాయితీలో ఏర్పాటై ఉన్న ఆదాని కృష్ణపట్నం పోర్ట్ సిబ్బంది మంగళవారం తమ్మిన పట్నం హరిజనవాడలో యువతకు క్రీడా సామాగ్రి గ్రామ సర్పంచ్ నెల్లిపూడి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో యువతకు ఇవ్వడం జరిగింది. క్రీడా సామాగ్రితో పాటు రెండు డోములైట్లు కూడా గ్రామానికి ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ యువత క్రీడల్లో ఉత్సాహంగా ఆడితే మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడం జరుగుతుందన్నారు. ఈ గ్రామానికి ఆదాని కృష్ణపట్నం పోర్టు ద్వారా గ్రామ అభివృద్ధికి ఎంతగానో అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ రమేష్ బాబు, ఆర్ గోవిందు, కె. రమేష్ బాబు, ఆదాని పోర్టు ఫౌండేషన్ ఎన్. వనజ, గ్రామ యువత, పెద్దలు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలసిన తెదేపా నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను తెలుగు దేశంపార్టీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం తిరుపతి పార్లమెంటు టిడిపి అధ్యక్షుడు నరసింహయాదవ్, రాష్ట్ర శాఫ్‌ఛైర్మన్ రవినాయుడు, శ్రీకాళహస్తి పట్టణ టిడిపి అధ్యక్షులు జి. విజయకుమార్ నాయుడులు కలసి పలు అంశాలు, సమస్యలపై చర్చించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## అట్టహాసంగా ముగిసిన రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలు

తిరుపతి క్రీడ, అక్టోబర్ 8, ప్రభాతవార్త



రాష్ట్ర స్థాయి టైక్వాండో పోటీలు మంగళవారంతో అట్టహాసంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలుగుదేశం యువ నాయకులు, డాలర్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని జాతీయ స్ధాయికి ఎంపికైన అండర్ 14, 17 బాల బాలికలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్ధాయి పోటీలలో మెరుగ్గా రానిచ్చి ఆంధ్రప్రదేశ్‌కి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. చాంపియన్షిప్ సాధించిన మొదటి స్ధానం రెండవ స్ధానం పొందిన జిల్లాలకు ట్రోఫీలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అండర్ 14, అండర్ 17 స్కూల్ గేమ్ సెక్రెటరీ ఎస్. బాబు, తిరుపతి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ కార్యదర్శి సుబ్రమణ్యం రెడ్డి, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ డాక్టర్ ప్రభాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు పూర్ణశరత్చంద్ర, మదన్మోహన్, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

## సారా విక్రేత అరెస్టు

నగరి, అక్టోబరు 8 ప్రభాతవార్త:

మండలంలోని గుండ్రాజుకుప్పం గ్రామ సమీపంలో సారా విక్రయిస్తున్న అడవికొత్తూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ముందస్తుసమాచారం మేరకు కాపుకాసిన పోలీసులు శ్రీనివాసులను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించగా, అతనికి కోర్టులో 15 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు.

## అగ్ని ప్రమాదంలో ఎలక్ట్రికల్ షాపు దగ్ధం

నగరి, అక్టోబరు 8 ప్రభాతవార్త:



మున్సిపల్ పరిధి కొత్తపేట వినాయకుని ఆలయసమీపం అరుణగిరి అనే వ్యక్తికి చెందిన ఎలక్ట్రికల్ షాపు సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఎలక్ట్రికల్ వస్తువులు రిపేరు చేసి ఇస్తూ అందులో వచ్చే ఆదాయంతో జీవనాన్ని కొనసాగిస్తున్న అరుణగిరి యధావిధిగా తన షాపును మూసి ఇంటికి వెళ్లగా రాత్రి అకస్మాత్తుగా షాపు నుంచి మంటలు వచిచ కాలిపోతుండటాన్ని స్థానికులు గుర్తించి అతనికి సమాచారం అందించారు. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు ఆర్పినా వస్తువులన్నీ పూర్తిగా కాలిపోవడంతో అరుణగిరి వీధిన పడ్డాడు. ప్రభుత్వమే అతన్ని ఆదుకోవాలని ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి కోరారు.

## జయములివ్వు తల్లీ జగజ్జననీ

నగరి, అక్టోబరు 8 ప్రభాతవార్త:



నియోజకవర్గంలోని దేవీ ఆలయాలు మంగళవారం పూజా కార్యక్రమాలతో హోరెత్తింది. బుగ్గ అగ్రహారం ఒన్నూరమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా అమ్మవారు లలితా త్రిపుర సుందరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. సర్పంచ్ రవికుమార్, స్థానిక భక్తులు పాల్గొన్నారు. నేత్ర ప్రధాయణి దేశమ్మ దేవత శ్రీ మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పట్టణ పరిధిలోని కరకంఠేశ్వరాలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి, కామాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు ,అభిషేకాలు చేశారు. కామాక్షిదేవికి కౌమారి అలంకరణ చేయగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. మండలంలో టీటీడీ ఆధీనంలోని బుగ్గ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం లోని అన్నపూర్ణాదేవి సన్నిధిలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణేశ్వరికి కాత్యాయని అలంకారం చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. అమ్మవారిని ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయాన్ని వేపాకులతోను, పూలదండలతో అలంకరించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

## యన్ఎం ఎం ఎస్ పరీక్షకు దరఖాస్తు గడువు పెంపు

తిరుపతి విద్య,అక్టోబర్ 8,ప్రభాతవార్త:

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబర్ 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తిరుపతి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ గురుస్వామి రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.దరఖాస్తు చేసుకోవటానికి ఆన్లైన్ అప్లికేషన్ ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూబిఎస్ఈ.ఏపీ.జిఓవి.ఇన్ నందు అందుబాటులో ఉన్నటు చెప్పారు.ప్రింటెడ్ నామినేల్ రోల్ మరియు ఎస్బిఐ ఫీజు చెల్లింపు రసీదులను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అక్టోబర్ 17వ తేదీ లోపుగా సమర్పించాలన్నారు.ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత మరియు ప్రాథమికోన్నత,వసతి సౌకర్యము లేని ఆదర్శ పాఠశాలలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు అన్నారు.తల్లిదండ్రుల ఆదాయం సంవత్సరానికి 3,50,000 రూపాయల లోపు ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు.ఓసి,బిసి విద్యార్థులు 100 రూపాయలు,ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు 50 రూపాయలు పరీక్ష ఫీజుగా చెల్లించాలన్నారు.ఇతర వివరాల కోసం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

## మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా పని చేయాలి:

శ్రీకాళహస్తి,అక్టోబర్ 8 ప్రభాతవార్త




మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా పని చేయాలని మంగళవారం సాలిపేట గజేంద్ర నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరిగిన సమావేశంలో వక్తలు పిలుపు నిచ్చారు. తిరుపతి జిల్లా టాస్క్ ఫోర్సు అధికారి డాక్టర్ శ్రీనివాసరావు నాయకత్వంలో జిల్లా గణాంక అధికారి నాగేంద్ర కుమార్,నరేష్,డిపిఓ ప్రకాష్ రోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అలాగే పట్టణ ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు, గర్భవతులు,బాలింతలు గర్భహీనతతో మరణించరాదని వారికి తగిన వైద్య సదుపాయాలు,కల్పించి రక్త హీనత లేకుండా వైద్యఆరోగ్యశాఖ చర్యలు తీసుకోవాలన్నారు.ఈ దిశగా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలన్నారు.మహిళలు కాన్పులను కేవలం ఆసుపత్రిలోనే జరగాలని,ఆపరేషన్లు కాకుండా సాధారణ కాన్పుకు అవకాశం కల్పించాలన్నారు.సాలిపేటలోని యుక్త వయస్సు,గర్భవతులను హిమగ్లోబిన్‌పరీక్షలు చేసి తక్కువగా ఉన్న వారికి తగదిన సలహాలు సూచనలు ఇచ్చారు. అంగన్‌వాడి బాలింతలకు గర్భవతులకు ఇచ్చేటటు వంటి వలవర్ధక ఆహారాన్ని తప్పకుండా ప్రతి ఒక్కరికి సద్వినియోగం ఎఎన్ఎం రికార్డులను పని తీరును పరిశీలించి వారికి తగిన సూచనలు చేసారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా గణాంక అధికారి నాగేంద్రకుమార్ ఇన్‌చార్జి డిపిఓ ప్రకాష్ వైద్యాధికారి స్రవంతి సిఓ,ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## కామాక్షమ్మకు పిండి అలంకరణ

శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 8 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని కందాడలో వెలసిన కామాక్షి సమేత సదాశివేశ్వరాల యంలో దేవి నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో మంగళవారం అమ్మవారికి అలంకరించిన పిండి అలంకారం భక్తుల్ని ఇట్టే ఆకట్టుకుంది.ఇక్కడ వెలసిన ఆలయంలో ఆధ్యాత్మిక చింతనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో వస్తున్నారు.చుట్టు పక్కల శివాలయం లేనందువల్ల ఇక్కడకు భక్తులు తరలి వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. మంగళవారం కావటంతో మహిళా భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో పిండి దీపాలను వెలిగించారు. గ్రామాల్లోని మహిళలు 'భవానీ దీక్షలు' పాటిస్తూ పూజలు జరుపుకున్నారు. వారు తమిళనాడులోని మేల్ మరవత్తూరు, విజయవాడలకు వెళ్ళి దీక్షలు విరమిస్తారు. మంగళవారం ఆలయంలో అమ్మవారికి పిండితో చేసిన అలంకారం ఇట్టే ఆకట్టుకుంది. ఉభయదారులుగా గుండ్రాజు నాగరాజు, విజయకుమారి, సుమతి, వకుళ, ఉత్తేజ్, నాగరాజునాయుడు, మంజుల, బ్రహ్మయ్య, జ్యోత్స్న, సుబ్రమణ్యం,సుమలత, బాలకృష్ణ,గీతల సారథ్యంలో విశేష అలంకారాలు, పూజలు,అన్నదానాలు జరిపారు.సాయంత్రం ఆలయ ఆవరణలో లలిత సహస్రనామార్చన,కుంకుమార్చనలు జరిపారు. పూజారులు ధనంజయస్వామి, నారాయణస్వామి, పందుస్వామి లు భక్తులకు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

## శ్రీకాళహస్తి ఆర్డీవోగా భాను ప్రకాష్‌రెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజనల్ అధికారిగా భానుప్రకాష్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన శ్రీకాళహస్తీశ్వరున్ని దర్శించుకున్న అనంతరం ఆయనకు కార్యాలయంలో వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు. తదనంతరం కార్యాలయ సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. కోనసీమ జిల్లాకు చెందిన ఆయన డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన శ్రీకాళహస్తి ఆర్డీవోగా తొలిసారి పోస్టింగ్ పొందారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో శివయ్య సన్నిధిలో తొలిసారి పోస్టింగ్‌రావడం ఎంతో అదృష్టమని తెలిపారు. శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాలతో పాటు సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం, నాగలాపురం, కెవిబిపురం, పిచ్చాటూరు మండలాలు వస్తాయని తొలుత బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఒక్కొక్క మండలాన్ని పరిశీలించి అక్కడ సమస్యలు ఏవేవి ఉన్నాయో తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలుతీసుకుంటామన్నారు.అనంతరం ఆయనకు తహశీల్దార్‌లు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎఓ శ్రీదేవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్డీవోను సత్కరించిన మున్సిపల్ కమిషనర్

శ్రీకాళహస్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఆర్డీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన భానుప్రకాష్‌రెడ్డిని మంగళవారం మున్సిపల్ కమిషనర్ గిరికుమార్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలో ఎన్ని వార్డులు ఉన్నాయి, సమస్యలు ఏమిటి అన్న వాటిపై కమిషనర్‌తో చర్చించారు. పుణ్యక్షేత్రంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్‌కు సూచించారు. వార్డులో ఏఏ సమస్యలు వచ్చినా వెంటనే చర్యలుతీసుకోవాలని ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలుతీసుకోవాలని కోరారు.

## జాబ్‌మేళాకు విశేష స్పందన - ప్రిన్సిపాల్ ఉషాదేవి

సత్యవేడు, అక్టోబరు 8 ప్రభాతవార్త:



సత్యవేడు మండలంలో ఉద్యోగాల విషయంలో చదువుకున్న యువత యువకులు అవకాశాలను అందిపుచ్చుకుంటే నిరుద్యోగ సమస్య తగ్గే అవకాశం ఉన్నట్టు తిరుపతి జిల్లా సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఉద్యోగ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషాదేవి మాట్లాడుతూ ఉపాధి కల్పనలో కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌కేంద్రం వేదికగా మారిందన్నారు. అయితే కొందరు చదువుకున్న యువత సాఫ్ట్‌వేర్ రంగం వైపు మొగ్గు చూపుతున్నారు తప్ప కంపెనీ వైపు రావడం లేదన్నారు. కానీ వస్తువు ఉత్పత్తి జరిగి ఆర్థిక పురోభివృద్ధి సాధనకు పరిశ్రమల నడవడం తప్పనిసరి అన్నారు. కానీ చదువుకున్న యువతి, యువకులు వారి మనోభీష్టం అనుసరించి ఎంచుకున్నరంగాల్లో నైపుణ్యం పెంచుకుంటే కెరియర్‌లో తిరుగు ఉండదన్నారు. సత్యవేడు గ్రామీణ అభివృద్ధి సంస్థ(వెలుగు) ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోశ్రీసిటీ పారిశ్రామిక వాడ నిరుద్యోగులకు ఒక పరమన్నారు. నిరుద్యోగ యువత యువకులు ఈ అవకాశ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీసిటీ ప్రత్యేక అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ 8వ తరగతి నుంచి డిగ్రీ, డిప్లమో, ఐటీఐ, పీజీ చదువుకున్న వారందరికి విద్యార్హతను బట్టి శ్రీసిటీలో ఉద్యోగ అవకాశ్యాలు ఉందన్నారు. అయితే తొలిసారిగా ఉద్యోగాల ప్రవేశంలో ఉన్నత క్యాడర్‌కి నిరుద్యోగులు ఎంపికయ్యే అవకాశాలు ఉండదని, వారి రంగంలో నైపుణ్యం పెంచుకోవడం ద్వారా అంచెలంచెలుగా ఎదగడానికి అపార అవకాశాలు ఉందన్నారు. తదనంతరం హీరో మోటారు కంపెనీ ఏజెన్సీ క్యూస్ ప్రతినిధి విజయకుమార్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు జోనల్ మేనేజర్ ప్రశాంత్ తదితరుల బృందం నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి పలువురుని ఎంపిక చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉద్యోగమేళా కొనసాగింది. కార్యక్రమంలో స్థానిక స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ చైతన్య, చక్రవర్తి, నిరుద్యోగ యువతి, యువకులు పాల్గొన్నారు.

## సాకాంబరి అలంకరణలో శ్రీ మానసాదేవి

పుత్తూరురూరల్, అక్టోబరు 8 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ ఆవరణలో ఉన్న శ్రీ నాగాలమ్మ దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని వివిధ రకరకాల కూరగాయలతో సుందరంగా అలంకరించారు. ఉదయం ఆలయంలో వినాయక స్వామి, మానసాదేవి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి నాగాలమ్మకు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు చేశారు. సాయంత్రం ప్రత్యేక అభిషేకాలు చేసి అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పసుపు కుంకుమలు అందించారు. కార్యక్రమానికి ఉభయ దాతలు తిరుపతి వాస్తవ్యులు ఇందిరాని, కె.రవీంద్ర కుమార్(రైల్వే అధికారి) దంపతులు కుమార్తె మౌనిక, సాయి అల్లుడు చంద్రశేఖర్, కుమారుడు వెంకటేష్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో నాగాలమ్మ స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్రో పోటీల్లో తడుకు ఆర్ఎస్ విద్యార్థుల ప్రతిభ

వడమాలపేట, అక్టోబరు 8 ప్రభాతవార్త:



వరల్డ్ స్పేస్ వారోత్సవాలు 2024లో భాగంగా తిరుపతిలో నిర్వహించిన ఇస్రో రాత పరీక్షలో తడుకు ఆర్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ పొందారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు జరిగిన ఇస్రో అంతరిక్ష వారోత్సవాలపై రాత పరీక్షల్లో సీనియర్స్ విభాగంలో తడుకు ఆర్ఎస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రుద్ర(9వ తరగతి) మొదటి స్థానం, జూనియర్స్ విభాగంలో హేమ(8వ తరగతి) రెండో స్థానం, కార్తీక్(8వ తరగతి) మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా జరిగిన సన్మానసభలో వారికి మెమెంటో, సన్మాన పత్రంతో అభినందించారు. పోటీల్లో పాల్గొని విజేతలుగా గెలుపొందిన విద్యార్థులను శ్రీహరి కోటకు తీసుకెళుతున్నట్లు గైడ్ టీచర్, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ అభినందించారు.

## పార్వతీదేవి అలంకారంలో కన్యకాంబ

వడమాలపేట, అక్టోబరు 8 ప్రభాతవార్త:



నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పార్వతీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి దర్శనమిచ్చారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం పంచామృత అభిషేకం, సాయంత్రం మహిళలు లలితా సహస్ర నామార్చనలతో కుంకుమ పూజలు చేశారు. రాత్రి అమ్మవారిని పార్వతీదేవిరూపంలో పూలమాలలు, ఆభరణాలతో అలంకరించారు. పురోహితులు ప్రసాద్‌శర్మ, వేదమంత్రాలు పటిస్తూ మంగళ హారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూడి అంకాళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

## శ్రీ పద్మావతి మహిళ వర్సిటీలో మానసిక ఆరోగ్య దినోత్సవ వేడుకలు

తిరుపతి విద్య,అక్టోబర్ 8,ప్రభాతవార్త:



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని హ్యూమానిటీ బ్లాక్ లోని సెమినార్ హాల్లో మహిళా అధ్యయన కేంద్రం,సైకాలజీ డిపార్ట్మెంట్ సంయుక్తంగా మానసిక ఆరోగ్య దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉమెన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి వాణి అధ్యక్షత వహించారు.మనసు ఆనందంగా ఉన్నప్పుడే ఒత్తిడిలేకుండా సమర్థవంతంగా పనిచేయవచ్చునని తెలిపారు.డాక్టర్ గణేష్ కుమార్,హెడ్,సైకియాట్రీ డిపార్టె మ్మెంట్,స్విమ్స్ తిరుపతి విచ్చేసి భారతదేశంలో పురుషలతో పోలిస్తే,మహిళలు ఎక్కువగా మానసిక రుగ్మతలకు గురవుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## మహాలక్ష్మి అవతారంలో బంగారమ్మ

కార్వేటినగరం,అక్టోబరు 8 ప్రభాతవార్త:



కార్వేటినగరం గ్రామదేవతయిన బంగారమ్మ ఆలయంలో దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహాలక్ష్మి అవతారంలో బంగారమ్మను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని శుద్ధి చేశారు. మంగళవారం తెల్లవారిజామున అమ్మవారికిపాలు,పెరుగు,పసుపు,కుంకుమ,చందనం,తెనే,నారికేళంలతో అభిషేకాలు నిర్వహించారు. బంగారమ్మను మహాలక్ష్మి అమ్మవారి అలకరణతో చక్కగా ఏర్పాటు చేశారు. పట్టువస్త్రాలు,ఆభరణాలు,పువ్వులు,గాజులతో అమ్మవారిని ఆడంబరంగా అలంకరించారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు.ఆలయం ముందు విద్యుత్‌దీపాలతో అమ్మవారి కటౌట్‌లను అమర్చారు.ఆలయంలో భక్తులకు తీర్థ,ప్రసాదాలు అందించారు.ఆలయ అధ్యక్షులు కొప్పేటిప్రసాద్, ఉపాధ్యక్షులురంగనాధమొదలియార్,కార్యదర్శిచంద్రశేఖర్‌పిళ్ళైలు,అర్చకులు చిదంబరశేఖర్‌లు పాల్గొన్నారు.

## అంకాళపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేకపూజలు

కార్వేటినగరం,అక్టోబరు 8 ప్రభాతవార్త:



కార్వేటినగరం డైట్ సమీపంలో వెలసియున్న శ్రీఅంకాళపరమేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేకపూజలు జరిగింది. శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఉభయదాతలైన కీళపూడి లలిత,దేవారెడ్డి ఆధ్వర్యంలో శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారిని శ్రీమహాలక్ష్మి దేవిగా అలంకరణ చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు,పువ్వులతో అలంకరించారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.కార్యక్రమంలో అర్చకులు జగదీష్,భక్తులు పాల్గొన్నారుజ

## గ్రామసభలో వినతిపత్రాలు స్వీకరణ

నగరి, అక్టోబరు 8 ప్రభాతవార్త:



మండలంలోని గుండ్రాజుకుప్పం గ్రామంలో మంగళవారం ఆర్డీవో వెంకటరెడ్డి గ్రామసభ నిర్వహించారు. రెవెన్యూ సంబంధించి గ్రామంలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు.గ్రామస్తులు పలు ఫిర్యాదులను వినతిపత్రం రూపంలో ఆర్డీవోకు అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అందుకున్న ఫిర్యాదులను త్వరలో పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీవో గ్రామస్తులకు హామీ ఇచ్చారు. సీఐ మహేశ్వర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు ధరించకపోతే ఎదురయ్యే ప్రమాదాల గురించి వివరించారు. సైబర్ క్రైమ్ పట్ల ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న నేరాల పట్ల ఎటువంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. సీసీ టీవీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించారు. తహసీల్దార్ రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవోసతీష్, సర్పంచ్ బాలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## బయోమెట్రిక్ పేరుతో వంటగ్యాస్ వినియోగదారులకు కుచ్చుటోపి

పాకాల, అక్టోబర్ 8, ప్రభాతవార్త



పాకాల మండల కేంద్రంగా ఎల్‌పిజి గ్యాస్ యాజమాన్యం పాకాల మండల పరిసర ప్రాంతంలో గ్యాస్ వినియోగదారుల నుంచి బయోమెట్రిక్ పేరుతో 60 రూపాయలు ప్రతి గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుల నుండి ఎటువంటి రసీదు ఇవ్వకుండా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. వినియోగదారులు ఆ యొక్క సొమ్ముకు రసీదు రూపంలో ఇమ్మని అడగడంతో అందుకు యాజమాన్యం వారు రసీదు దీనికి ఇవ్వబడదని చెప్పి వేలు ముద్ర పెట్టకపోతే మీకు ప్రభుత్వం నుంచి ఉచిత గ్యాస్ రాదు అని మభ్యపెట్టి 60 రూపాయిలు వసూలు చేస్తూ చుట్టు పక్కల గ్రామస్తులందరినీ మోసం చేస్తున్నారు. ఇది కాకుండా వినియోగదారుడికి సిలిండర్ ఇచ్చిన ప్రతి సారి అదనంగా 40 రూపాయిలు వరకు వసూలు చేస్తున్నారు. రోజుకు 300'/40 సిలిండర్లు అనుకొన్నా నెలకు 24 పని దినములు, సంవత్సరానికి ఎంత గత 25 ఏళ్లలో ప్రజల వద్ద నుంచి ఎంత దోచేశారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పాకాల గాంధీ నగర్ ప్రజలు తహశీల్దార్‌ను మంగళవారం కలిసి జరిగిన కష్టాన్ని నష్టాన్ని అర్జీ రూపంలో విన్నవించడం జరిగింది. దీనిపై తహశీల్దార్ సానుకూలంగా స్పందించారు. ఈ జనార్దన్ నాయుడు, గాంధీ నగర్ గ్రామస్తులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ సమితి ప్రెసిడెంట్ పి. మునిప్రభాకర్, చిత్తూరు డివిజన్ అధ్యక్షులు, కలికిరి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గుంతలమయంగా దామలచెరువు రైల్వే లెవెల్ క్రాసింగ్ రోడ్

పాకాల, అక్టోబర్ 8, ప్రభాతవార్త



పాకాల మండలం దామలచెరువు కుక్కలపల్లి రైల్వే ఆధీనంలోని లెవెల్ క్రాసింగ్ గేట్ ఎస్ మలుపు కలిగి వున్న ఈ మలుపు రోడ్డులో కొంత కాలంగా రోడ్ పైన భారీ గోతులు ఏర్పడటంతో ఈ మార్గం లో ప్రయాణించే కారు, ఆటో, ద్విచక్రవాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురి అవుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా రైల్వే ఉన్నతాధికారులు సమస్యను క్షేత్రస్థాయిలో గుర్తించి గుంతలు పడ్డ రోడ్డు మరమ్మత్తులు చేయాల్సిందిగా ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

## ఓంశక్తి ఆలయంలో సహపంక్తి భోజన కార్యక్రమం

నగరి, అక్టోబరు 8 ప్రభాతవార్త:



నగరి పట్టణంలోవెలసి ఉన్న ఓం శక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు సహపంక్తి భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో నగరి మున్సిపల్‌చైర్మన్ పీజీ నీలమేఘం, మాజీ ఎంపీపీ మీర, కోనేరు సుబ్రహ్మణ్యం మొదలి, కోనేరు మురళి, ధనలక్ష్మి, కాశీనాథ్, ప్రమీల దేవి, కోటి మొదలి, పోస్టల్ డిపార్ట్‌మెంట్ సురేష్, వేలు అరుణ్‌కుమార్, ఆదిశివ, జీవన్‌బాబు, లక్ష్మిపతి, రాణి గజేంద్రనాయుడు, మహిళా పోలీసు శైలజ బాబు, జయంతిలు ఉభయదారులుగా వ్యహరించారు. వారికి పూజల అనంతరం ఆలయ మర్యాదలు నిర్వాహకులు ఏర్పాట్లు కావించారు.

## రెవెన్యూ అధికారుల కళ్ళకు గంతలు

### న ఆక్రమణలపై జిల్లా పరిపాలన అధికారి స్పందించాలి

సత్యవేడు, అక్టోబరు 8 ప్రభాతవార్త:



తమ కళ్ల ఎదుటే ప్రభుత్వ భూమిని తమిళనాడులో స్థిరపడ్డ వ్యక్తి ఆక్రమించుకుని నిర్మాణాలు చేసుకుంటున్నా రెవెన్యూ అధికారుల్లో చలనం లేకపోవ డం పలు అనుమానాలకు తాగిస్తోందని మండల పరిధిలోని ఇరుగుళం పంచాయతీ వాసులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణదారుడుతో రెవెన్యూ సిబ్బంది తెరచాటు ఒప్పందం మూలంగా నిక్కచ్చిగా స్పందించాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షకపాత్రలో పడిపోయిందని వారు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా ఇరుగుళం పంచాయతీ గొల్లపాళెంలో సర్వే నెం.210లో ఉన్న సుమారు 60 సెంట్లు భూమిని తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకుని వివిధ నిర్మాణాలు చేపడుతున్నాడు. ఇదే విషయంపై సామాజిక మాధ్యమాల్లోకూడా వార్త కథనాలు వచ్చాయి. స్పందించిన రెవెన్యూ సిబ్బంది ఆక్రమణ దారుడికి నోటీసులు ఇస్తాం అతని వద్ద రికార్డు లేవని, అవసరమైతే భవనాన్ని కొట్టేస్తామని చెప్పుకొచ్చిన వారు ఆ గ్రామం వైపే కన్నెత్తి చూపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఇరుగుళం పంచాయతీ వాసులు ఆరోపిస్తున్నారు. గొల్లపాళెం వాసులు కూడా కొందరు ఇదే అదునుగా ఖాళీ స్థలాలపై దృష్టి పెట్టి ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. జిల్లా కలెక్టర్ సత్యవేడు మండలంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆక్రమణ విషయాలపై కొరడా జులిపించాలని కోరుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మండలంలో ప్రభుత్వ భూములకు మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సమస్యల సుడిగుండంలో హౌసింగ్‌బోర్డు కాలనీ

శ్రీకాళహస్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త



పట్టణంలోని 28వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీలో సమస్యలు తిష్టవేశాయి. గత 25 సంవత్సరాలు మునుపు నిర్మించిన కాలువలు పూర్తిగా దెబ్బతినడంతో కాలువలో మురికినీరు వెళ్ళేందుకు ఉండడంతో దోమలు బెడద ఎక్కువైంది. దీంతో ఇక్కడ కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, యువత మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాల బారినపడుతున్నారు. పాత కాలువల్లో సిల్టు పేరుకుపోవడంతో కొత్తకాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. కాలనీలో ముళ్ళపొదలుతో దర్శనమిస్తున్నాయి. ఈరోడ్లను వాడుకలోకితీసుకుని రావాల్సిన అవసరం ఎంతైనఆ ఉంది. గత ప్రభుత్వంలో సచివాలయ సిబ్బంది వాలంటీర్లు చేతివాటంతో కాలనీలో వికలాంగ పెన్షన్‌లు, రేషన్‌కార్డులు, ఇంటిపట్టాలుకు నగదు తీసుకుని దొంగసర్టిఫికెట్లు ఇప్పించినట్లుగా ప్రజలు ఆరోపిస్తున్నారు. అందువల్ల వార్డులో అసలైన పడకలో ఉన్న రోగులు, వికలాంగులుకు చేరాల్సిన ఫించను చేరలేదని, దీనిపై మున్సిపల్ అధికారులు తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించాల్సిందిగా కాలనీ వాసులు కోరుతున్నారు.

## మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చిన కరుమారియమ్మ

తిరుపతి రూరల్, అక్టోబర్ 8, ప్రభాతవార్త



దేవీ నవరాత్రుల్లో భాగంగా తిరుపతి రూరల్ మండలం పేరూరు స్టాఫ్ క్వార్టర్స్ వద్ద వెలసియున్న కరుమారియమ్మ నాగాలమ్మ మంగళవారం మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. దేవి నవరాత్రులను పురస్కరించుకొని అమ్మవారు ప్రతి రోజు ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవి నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారు ప్రతి రోజు ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. ఆలయ ధర్మకర్త, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు ఆధ్వర్యంలో ప్రతి రోజు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. దయం అభిషేకాలు, సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారి దర్శించుకున్న భక్తులందరికీ అన్న ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. ప్రతి రోజూ సాయంత్రం అన్నమాచార్య కళామందిర్ వారి ఆధ్వర్యంలో భక్తి గీతాల ఆలాపన జరుగుతోంది. కోరిన వరాలిచ్చే కొంగుబంగారమైన అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు.

## శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో మరగదాంభిగా



కాణిపాకం,అక్టోబర్ 8 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవరోజు మంగళవారం మరగదాంభిగా అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈమేరకు ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చక స్వాములు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యాలను సమర్పించి విశేష సమర్పణ గావించారు. అలాగే అమ్మవారి ఉత్సవమూర్తిని మండపంలో వుంచి శ్రీఅన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి మొకు ్కలు తీర్చుకున్నారు. అలాగే సాయంత్రం సామూహిక కుంకుమార్చన, రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.


**CHANGE OF NAME**

I,**CHERUKURU DHANANJAYA NAIDU** (old Name), R/ at DNo.3-89/18-4,Vigneswara Nagar, Kothapalem Layout, Yogimallavaram, Tiruchanur, Tirupati Dt, AP. I haveChanged my name as **CHERUKURI DHANANJAYA NAIDU** S/o. **CHERUKURI RAMANAYYA NAIDU** (New name),

I,**KANDALA MUNIRATHNM NAIDU** (old Name), R/ at DNo. 5-19, Kandalavaripalli(V) , Kannikapuram (P), RC Puram (M), Tirupati Dt, A.P. I have changed my name as **KANDALA MUNIRATHNAM NAIDU** S/o **KANDALA VENKATAMUNI NAIDU** (New Name)

